

'సోమశిల'లో 72.5 టీఎంసీల నీరు

అనంతసాగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శుక్రవారం 16,190 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 72.559 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 250, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 13 మంది హిజ్రాలు నగర శివార్లలోని దాబా హోటల్ వద్దకు వెళ్లారు. దసరా మాముళ్లు ఇవ్వాలని అక్కడున్న మేనేజర్ హేమంత్‌ను డిమాండ్ చేశారు. తమ యజమాని లేడని చెప్పడంతో హిజ్రాలు దౌర్జన్యానికి దిగారు. వెంటనే యజమానికి ఫోన్‌చేసి పిలవాలంటూ వారు దాబాలో హంగామా సృష్టించారు. దీంతో భోజనం చేస్తున్న కస్టమర్లు వారి వెకిలి చేష్టలకు భయపడి వెళ్లిపోయారు. అడ్డుకున్న దాబా హోటల్ సిబ్బందిపైనా దౌర్జన్యం, దాడి చేసి జారుకున్నారు. ఈ ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి హిజ్రాలను అరెస్ట్ చేశారు.

ఈ నెల 23వ తేదీ రాత్రి కందుకూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు హిజ్రాలు వెళ్లి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కడ విధుల్లో ఉన్న ఓ నర్సు డాక్టరు లేరని, గొడవ చేయద్దని చెప్పడంతో నర్సుపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ దాడి కేసులో ఐదుగురు హిజ్రాలను కందుకూరు పోలీసులు అరెస్ట్ చేశారు.

వెలుగులోకి వచ్చినవి ఈ రెండు సంఘటనలే. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. సమాజంలో హిజ్రాలను చాలా పవిత్రంగా చూస్తారు. కానీ, ఆ ముసుగులో కొంతమంది చేస్తున్న దౌర్జన్యాలతో ప్రజలు, వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. వారు అడిగినంత ఇస్తే సరే.. లేదా దాడులు చేస్తున్నారంటూ వాపోతున్నారు.



కందుకూరులోని ఓ ఆసుపత్రిలో నర్సుపై హిజ్రాలు దాడి చేస్తున్నట్లు సీసీపుటేజీలో నమోదైన దృశ్యం (ఫైల్)

ఆశీర్వచన చేతులతో

దీవెళ్లుగా భావించే స్థాయి నుంచి రౌడీలుగా చూసే స్థాయికి..

అరాచకాలా!?

- జిల్లాలో పేట్రేగిపోతున్న హిజ్రాల దాడులు
- వారి ముసుగులో మరికొందరి దౌర్జన్యం
- వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలు

జిల్లాలో హిజ్రాల బెదిరింపులు, దౌర్జన్యాలకు అడ్డూఆపు లేకుండా పోతోంది. మనకెందుకులే అనుకొని హిజ్రాలు ఇబ్బందులు పెడుతున్నా చేసేది లేక ప్రజలు తలదించుకొని వారు అడిగినంత ఇచ్చి వెళ్లిపోతున్నారు. కొందరు హిజ్రాల ముసుగులో చీరలు కట్టుకొని దందాలకు పాల్పడుతూ నగదు దోచుకుంటున్నారు. ప్రధానంగా ప్రధాన రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు ఉన్న చోట హిజ్రాలు షిఫ్టుల పద్ధతిలో కాపుకాసి వాహనదారుల నుంచి ముక్కుపిండి నగదు వసూలు చేస్తున్నారు. ఇక నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండు నుంచి అయ్యప్ప గుడి వరకు, మినీ బైపాస్‌లో బీవీనగర్ వరకు హిజ్రాలు రోడ్డుపై కనిపించే ప్రతి ఒక్కరినీ నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నగదు ఇవ్వని వారితో గొడవపెట్టుకుంటున్నారు.

వారంటే ఎంతో భక్తి

'హిజ్రాలు ఆశీర్వదిస్తే మంచి కలుగుతుంది. వారు దిష్టి తీస్తే సైతాన్‌లు కూడా పరుగులు తీస్తాయి. గుమ్మడికాయ, టెంకాయ కొడితే దిష్టిపోయి వ్యాపారం బాగా వృద్ధి అవుతుంది.' అని నమ్మే ప్రజలు కోకొల్లలుగా ఉన్నారు. ఈ క్రమంలోనే అమావాస్య రోజున ప్రధానంగా వ్యాపారులు హిజ్రాలను దుకాణాలకు పిలిచి, దిష్టి తీయించడం ఆనవాతీగా మార్చుకున్నారు. దుకాణం వద్దకు హిజ్రాలు వస్తే అదృష్టంగా భావించి, నగదు ఇచ్చి పంపుతారు. ఎక్కడైనా వారు కనిపించినా ప్రజలు నగదు ఇచ్చి, ఆశీర్వచనం పొందుతారు.

● గ్రూపులుగా విడిపోయి దందాలు

గతంలో తమ సంఘం నాయకుల వద్దకు జిల్లావ్యాప్తంగా ఉన్న హిజ్రాలు అంతా చేరేవారు. నాయకుల మాటలు జవదాటకుండా ప్రజలను ఆశీర్వదిస్తూ వారు ఇచ్చిన నగదు తీసుకొని సంతోషంగా ఇళ్లకు చేరుకునేవారు. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. హిజ్రాల్లో నాయకుల మధ్య గొడవలు పెరిగిపోవడంతో ఒకరిని ఒక్కరు చంపుకునే స్థాయికి వెళ్లిపోయారు. ఇటీవల కొడవలూరు వద్ద హిజ్రాల సంఘం నాయకురాలు హాసిని హత్య కేసులో ప్రత్యర్థి వర్గానికి చెందిన హిజ్రాలను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బయట నుంచి వచ్చిన పలువురు హిజ్రాల ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారన్న ఆరోపనణ ఉన్నాయి. జిల్లాలో జరుగుతున్న హిజ్రాల దౌర్జన్యాలు, బెదిరింపులు, వేదింపులకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరులో దాబా హోటల్‌పై దాడి చేసిన హిజ్రాలను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

జొన్నవాడ ఆలయ కమిటీ నియామకం

ఎక్స్ అఫిషియోతో సహా 12మందితో పాలకవర్గం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయానికి ట్రస్టు బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎక్స్ అఫిషియో సభ్యుడితో సహా 12 మందితో పాలక వర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన తిరుమూరు అశోక్ రెడ్డిని ఎన్నుకోనున్నారు. సభ్యులుగా నక్కల శివకృష్ణ, తిరువాయిపాటి నందకుమార్, పెన్నతూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మి, పాలూరు చాముండేశ్వరి, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూష, ముంగర సుధాకర్, రామాయణం సుధారాణి, కొళ్ళపూడి శారద, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వారణాసి వెంకట శివ గంగా ప్రసాద్ నియమితులయ్యారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో డీఎస్సీ ఎంపిక జాబితా

● అభ్యంతరాలు ఉంటే తెలపండి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాలను విడుదల చేసి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ఆర్. బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్య ర్థులపై ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలున్నా అక్టోబరు 25వ తేదీలోపు జోన్, రాష్ట్రస్థాయి గ్రీవెన్స్‌లో తెలియచేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయి పోస్టుల ఎంపికకు సంబంధించి జోనల్ కమిటీ, రాష్ట్రస్థాయి పోస్టులకు రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ రెండింటిలోనూ సంతృప్తి చెందని వారు పాఠశాల విద్యా సంచాలకులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. వచ్చిన సమస్యలన్నీ టీనీ 30 రోజుల్లో పరిష్కరిస్తారని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

విధులకు రాకపోయినా

రూ.24.62 లక్షల జీతం!

అవినీతి, ఆరోపణలకు కేంద్ర బింధువైన వైద్య ఆరోగ్య శాఖలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఓ మెడికల్ ఆఫీసర్ ఏకంగా 31 నెలలపాటు విధులకు డుమ్మా కొట్టారు. అయితే, ఆయనకు ప్రతి నెలా ఠంచనుగా ప్రభుత్వ నిధులను జీతంగా చెల్లించారు. అది కూడా రూ.వందలు, వేలల్లో కాదు.. రూ.24.62 లక్షలు దోచిపెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ విధానం నడవగా, ప్రస్తుత ప్రభుత్వంలో బ్రేకులు పడ్డాయి. ఈ భారీ స్కామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విచారణాధికారిని నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం జీవో నెం.640 విడుదల చేసింది.

- ఓ మెడికల్ ఆఫీసర్ 31 నెలలపాటు డుమ్మా
- అయినా ఠంచనుగా ప్రతీ నెలా వేతనం
- పూర్వపు డీఎంహెచ్‌వో పెంచలయ్య నిర్వాకం
- నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది డిప్యుటేషన్లు
- చార్జస్ ఫ్రేమ్.. విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో సుదీర్ఘకాలం డీఎంహెచ్‌వోగా పనిచేసిన పెంచలయ్యపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. కృష్ణాపురం పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ సుమన్ ఎండీ (పీడియాట్రిక్స్) చదువుకునేందుకు 2022, మే నెలలో నారాయణ మెడికల్ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటాలో చేరారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. అయినా ప్రతి నెలా ప్రభుత్వం నుంచి ఆయనకు జీతం చెల్లించారు. ఈ విషయంలో పూర్వపు డీఎంహెచ్‌వో పెంచలయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రభుత్వం అభియోగాన్ని నమోదు చేసింది. వంశీకృష్ణ పీజీ కోర్సులో చేరాక డీఎంహెచ్‌వో పెంచలయ్య ఏడు సార్లు మెడికల్ ఆఫీసర్లతో సమావేశాలు నిర్వహించారు. కానీ ఏ ఒక్క సమావేశానికి వంశీకృష్ణ హాజరుకాలేదు. అయినా డీఎంహెచ్‌వో పట్టించుకోలేదన్నది ప్రభుత్వ అభియోగం. ఇక ఈ సమయంలోనే కన్సాలిడేటెడ్ పేమెంట్‌తో విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణకు అప్పటి డీఎంహెచ్‌వో రెగ్యులర్ పే స్కేల్‌కు మార్చారు. దీంతో జీతం కూడా పెరిగింది. ఇలా గతేడాది సెప్టెంబరు వరకూ 31 నెలల పాటు విధులకు హాజరుకాకపోయినా అప్పటి డీఎంహెచ్‌వో పెంచలయ్య సదరు ప్రతీ నెలా జీతం చెల్లిస్తూ రూ.24.62 లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ప్రభుత్వం అభియోగం మోపుతూ చార్జస్ ఫ్రేమ్ చేసింది. ఎఫ్ఆర్ఎస్ హాజరు ఉంటేనే జీతం చెల్లించాలని అప్పట్లో నిబంధన ఉన్నా వంశీకృష్ణ విషయంలో అప్పటి డీఎంహెచ్‌వో నిర్ధారించుకోలేదు. మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరుకావడం లేదన్న విషయం తెలిసినా డీఎంహెచ్‌వో తన బాధ్యతల మేర ప్రవర్తించలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.



● విరుద్ధంగా డిప్యుటేషన్లు

కాగా పెంచలయ్యపై ప్రభుత్వం మరో విషయంపైనా చార్జస్ ఫ్రేమ్ చేసింది. సిబ్బందిని డిప్యుటేషన్లపై ఒకచోట నుంచి మరోచోటకు పంపకూడదని అప్పట్లో వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు విధించింది. ఎక్కడైనా అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని నాటి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఉత్తర్వులను కూడా లెక్క చేయకుండా నాటి డీఎంహెచ్‌వో పెంచలయ్య ఇష్టం వచ్చినట్లు సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేసినట్లు ప్రభుత్వం అభియోగం మోపింది. 14 మంది మెడికల్ ఆఫీసర్లు, ఫార్మాసిస్టులు వంటి సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపారని వివరాలతో సహా పేర్కొంది. దీనిపై కూడా చర్యలకు చార్జస్ ఫ్రేమ్ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ చార్జస్ అన్నింటినీ ఫ్రేమ్ చేయగా, వీటిపై పెంచలయ్యను వివరణ కోరారు. ఆయన సమర్పించిన వివరణను ప్రభుత్వం తిరస్కరించింది. ఈ క్రమంలో తదుపరి చర్యల కోసం నిబంధనల మేరకు విచారణాధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జోన్ రీజనల్ డైరెక్టర్ డా. పీ రాధారాణిని విచారణాధికారిగా నియమించగా, రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. కాగా విచారణ ఎదుర్కొంటున్న పెంచలయ్య ప్రస్తుతం కడపలోని 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు.



కందుకూరు : కోవూరు రోడ్డులోని దుర్గాభవాని ఆలయంలో రూ.30,01,116 కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ



నెల్లూరు : సరస్వతీదేవి అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి

కరెన్సీ నోట్లతో అమ్మణ్ణి వైభోగం

వివిధ రూపాలలో కొలువుదీరుతున్న అమ్మవార్లు కనులవిందు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శుక్రవారం అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, కన్యకపూజలు, చండీ హోమం తదితర పూజలు వేడుకగా జరిగాయి. కందుకూరులోని దుర్గాభవాని అమ్మవారు రూ.30.01 లక్షల కరెన్సీ నోట్లతో ముచ్చటగొలిపారు. నెల్లూరు నగరంతోపాటు పెంచలకోన, జొన్నవాడ, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● సమస్యలుంటే తెలియజేయండి : జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వరి కోతలు జరుగుతున్న ప్రతి గ్రామంలోనూ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటిం చిన మద్దతు ధరకు ఈ కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. గ్రేడ్-ఏ రకం పుట్టి రూ.20306, సాధారణ రకం ధాన్యాన్ని పుట్టి రూ.20136 ధరకు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని జేసీ కోరారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలుంటే రైతులు 8520879979 నంబర్‌కు ఫోన్ చేయవ చ్చని తెలిపారు.



దెబ్బ తిన్న వరి పైరును చూపిస్తున్న రైతులు

మాకేంటి.. ఈ ఖర్మ!

చెరువు తూము ద్వారా నీరు విడుదల.. దెబ్బ తిన్న వరి

లింగరాజు అగ్రహారం రైతుల ఆవేదన

జలదంకి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): 'ఆరుగాలం కష్టపడి వరి పండిస్తే.. తీరా పంట కోసే సమయంలో చెరువు తూము బార్లా ఎత్తేశారు. దీంతో నీరంతా పొలాల్లోకి చేరడంతో వరి దెబ్బ తినింది. నారు కోయలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఈ ఖర్మ ఏంటి?' అంటూ జలదంకి మండలం లింగరాజు అగ్రహారం రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని చెరువు కింద 150 ఎకరాల వరకు ఎడగారు సాగు చేశారు. కోతల కారణంగా చెరువు తూమును రైతులు కొందరు మూసేశారు. అయితే చేపల పెంపకానికి వేలంలో దక్కించుకున్న కొందరు వర్షాలు కురుస్తుండడంతో ఉన్న చేపలను పట్టి అమ్ముకోవాలనే ఉద్దేశంతో మూసిన తూమును తెరిపించి, నీటిని కిందకు వదిలేశారు. దీంతో ఈ నీరంతా పొలాల్లోకి చేరడంతో వరికోతలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అతి కష్టంతో యంత్రాలను పొలాల్లోకి తీసుకెళ్లి వరికోతలు సాగిస్తున్నారు. ఒక ట్రక్కుకు 2, 3 ట్రాక్టర్ ఇంజన్లు జోడించి ధాన్యం బయటకు తెచ్చుకుంటున్నారు. చేపల పెంపకం పాటదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

29న ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించుకోండి!

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న నెల్లూరులో పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా ఈపీఎఫ్ అధికారి డీ. కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భవిష్య నిధిని చెల్లించే వారి కోసంగా నిధి ఆప్కే నిఖత్-2 కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని వేదాయపాళెంలో ఉన్న లిల్లీ లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్ కళాశాలలకు 28 నుంచి దసరా సెలవులు

నెల్లూరు (విద్య) :జిల్లాలోని జూనియర్ కళాశాలలకు ఈ నెల 28 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల కింద పనిచేసే ఇంటర్ కళాశాలలన్నీ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్వరలో కొత్త పంచాయతీలు!

వచ్చే ఏడాది గ్రామ సమరం ● ఎన్నికల్లోపు విభజనకు కసరత్తు ● ప్రతిపాదనల స్వీకరణ ● పెరగనున్న సర్పంచ్ పదవులు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య పెరగనుందా..?, కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయా.. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవులు పెరగనున్నాయా... అంటే ఇందుకు అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన ప్రాయంగా సంకేతాలు ఇవ్వడంతో జిల్లాలోని పల్లెల్లో హడావిడి మొదలైంది. ప్రస్తుత పంచాయతీ పాలక మండళ్ల కాల పరిమితి వచ్చే ఏడాది ఏప్రిల్ 2 నాటికి ముగియనుంది. ఈలోపే ఎన్నికలు నిర్వహించాలని, అందుకు సర్వం సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ నుంచి ఇటీవల జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. పోలింగ్ బూత్‌లు, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా, పంచాయతీల విభజన తదితర ఏర్పాట్లకు సంబంధించి షెడ్యూల్‌ని ప్రకటించింది. అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



● కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు

ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పంచాయతీల విభజన ప్రతిపాదనలు పంపాలని ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి నుంచి ప్రతీ పంచాయతీకి ఉత్తర్వులు వెళ్లాయి. దీంతో పంచాయతీల విభజనపై రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఉదయగిరి నియోజకవర్గం నుంచి 9 పంచాయతీల విభజనకు ప్రతిపాదనలు వచ్చాయి. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఆరు పంచాయతీలు, కొడవలూరు మండలం నుంచి రెండు, సంగం మండలం నుంచి ఒకటి చొప్పున ప్రతిపాదనలు జిల్లా పంచాయతీ కార్యాలయా నికి వచ్చాయి. ఇంకా అనేక మండలాల నుంచి ప్రతిపాదనలు రానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 941 పంచాయతీలు ఉండగా జిల్లాల విభజనతో ఆ సంఖ్య 722కు తగ్గింది. తాజా పరిణామాలతో పంచాయతీల సంఖ్య మళ్లీ పెరిగే అవకాశం ఉంది. ప్రతిపాదనలకు డిసెంబరు 3వ తేదీ వరకు గడువు ఉంది.

● 3 కి.మీ.. 3 వేల జనాభా..

ప్రస్తుత పంచాయతీ నుంచి కనీసం మూడు కిలోమీటర్ల దూరం, మూడు వేల జనాభా కలిగి ఉంటేనే కొత్త పంచాయతీ ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ నిబంధనలకు లోబడిన ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తుంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,851
వెండి కిలో ధర	రూ. 1,42,000
వెండి ఒక గ్రాము	రూ.145.00

రౌడీషీటర్లపై నిఘా ఉంది జాగ్రత్త..!

నెల్లూరురూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మీరు ఎక్కడకు వెళ్లినా, ఏం చేసిన మాకు తెలిసిపోతుంది.. మీ ప్రతీ అడుగుపై పోలీసు నిఘా ఉంటుంది జాగ్రత్త..! అంటూ నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు రౌడీషీటర్లను హెచ్చరించారు. రౌడీమేళాలకు తరుచూ గౌర్హాజర వుతున్న ముగ్గురు రౌడీషీటర్లను శుక్రవారం స్టేషన్ పిలిపించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తూ ఎక్కడైన, ఎవరితోనైన ఘర్షణలు, వివాదాలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, వారి సన్నిహితులు, స్నేహితులపైనా పోలీసు శాఖ నిఘా ఉంటుందని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

న్యాయసేవపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారిణి వాణి

నెల్లూరురూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొంతాలిలో శుక్రవారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయాధికారి కే.వాణి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఎదుర్కొంటున్నారు 15100కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. మావన అక్రమ రవాణపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అనునిత్యం అప్రమత్తతో వ్యవహరించాలని, మీకు ఎలాంటి సమస్యలున్నా మాకు తెలియచేస్తే వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. అక్షరాస్యత వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు కృష్ణప్రసాద్, స్థానిక గ్రామాధికారులు పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో డాక్టరేట్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీతారామపురం మండలం ఓగూరువాండ్లపల్లికి చెందిన రామాంజనేయలు ఫిజిక్స్‌లో డాక్టరేట్ సాధించారు. గీతం విశ్వవిద్యాలయంకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో కాపర్, కోబాల్డ్ డోప్డ్ బేరియం హేగ్జాఫైరైట్‌పై పరిశోధన పత్రాలు సమర్పించడంతో యూనివర్శిటీ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయనను సహచరులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు వాడకం వలన కలిగే నష్టాలపై నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.హజరత్తయ్య మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత ముందుండాలన్నారు. బాలాజీనగర్ సీఐ కె.సాంబశివరావు, ప్రభుత్వ వైద్యశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఏ.విజయకుమార్‌లు మాదక ద్రవ్యాల వినియోగిస్తే కలిగే నష్టాలు, చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా నవరాత్రి ఉత్సవాలు



మూలాపేట శివాలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన భువనేశ్వరిదేవి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో గజలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి శ్రీలలితా అలంకారం, విరాట్ నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రీ దేవికి లలితా పరమేశ్వరిదేవి అలంకారం, బాలాజీ నగర్ సీతారామ మందిరంలో సీతాదేవికి గజలక్ష్మీ అలంకారం, నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి కాత్యాయనీదేవి అలంకారం జరిగాయి. పప్పులవీధి మహాలక్ష్మీ ఆలయంలో మహాలక్ష్మీ అలంకారం, సిద్ధేశ్వరాలయంలో ధనలక్ష్మీ అలంకారం, అయ్యప్పగుడి గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఆదిలక్ష్మికి అన్నపూర్ణాదేవి అలంకారం, రంగనాయకుల పేట వేదాంత దేశికర్ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో శ్రీమద్‌వేదాంత దేశికుల వారికి యాళి వాహనంపై పేట ఉత్సవం జరిగింది.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి : సీపీఎం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతపేట మార్కెట్‌లో అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలసి మార్కెట్‌ను పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లుగా ఇక్కడే పాత గుడ్డల వ్యాపారం చేసుకుంటున్న వీరు అగ్నిప్రమాదంతో జీవనోపాధిని కోల్పోయారన్నారు. ఒక్కొక్కరికి రూ.2లక్షల నష్టపరిహారం చెల్లించాలని, దుకాణాల కు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, నరసింహ, రమణారెడ్డి, అమాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

● రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలి : సీపీఐ

నగరంలోని సంతపేట పాత గుడ్డల మార్కెట్‌లో అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయిన బాధిత వ్యాపారులకు ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి నందిపోగుల రమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సంతపేట మార్కెట్‌ను సీపీఐ నేతలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా లక్షల విలువైన దుస్తులు కొనుగోలు చేసి దుకాణంలో భద్రపరచారన్నారు. అగ్ని ప్రమాదంలో ఆ దుస్తులు పూర్తిగా కాలిపోయాయన్నారు. దీంతో 20కి పైగా దుకాణాల బాధితులు నిరాశ్రయులయ్యారిని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలానీఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు లీలామోహన్, రేవంత్, లక్ష్మయ్య, అజయ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కంటైనర్లలో దుకాణాలు బాగున్నాయి

● మెప్మా డైరెక్టర్ తేజ్‌భారత్



స్ట్రీట్ బజార్‌ను పరిశీలిస్తున్న తేజ్‌భరత్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కంటైనర్లను దుకాణాలుగా మార్చడం బాగుందని మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన ఆయన వైపాడు రోడ్డు వెంబడి నిర్మిస్తున్న స్ట్రీట్ బజారును ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. పేద మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ఈ ప్రాజెక్టును రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా చేపట్టామన్నారు. ఈ దుకాణ సదుపాయాలు అన్ని వసతులతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అనంతరం ఎన్‌ఎంసీలోని మెప్మా, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై స్ట్రీట్ బజారుకు వెచ్చించిన వ్యయం, ఎన్ని కుటుంబాలు లబ్ధి పొందుతున్నా యి తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే కమిషనర్ నందన్ స్టోన్ హౌస్‌పేట మున్సిపల్ కాంప్లెక్స్‌ను పరిశీలించి బకాయిలున్న దుకాణాలను జప్తు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత తాళ్లపాక అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

● వేదగిరి క్షేత్రంలో సుదర్శన హోమం ● వాడవాడలా సేవా కార్యక్రమాలు



వేదగిరిలో పూజలు చేస్తున్న గిరిధర్‌రెడ్డి



సుదర్శన హోమంలో టీడీపీ నాయకులు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వాడవాడలా సేవా కార్యక్రమాలు, ఆలయాల్లో పూజలు, మసీదు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నేతృత్వంలో వేదగిరి క్షేత్రం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ సన్నిధిలో సుదర్శనహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే నిండు నూరేళ్ల సంతోషంగా ఉండాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు సేవచేయాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం చేశారు. వేదగిరి క్షేత్రం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్లు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి చక్రవర్ధన్‌రెడ్డి, మలినేని వేణునాయుడు, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు. నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి డైరెక్టర్లతో కలిసి మద్రాస్సు బస్టాండ్ కూడలిలోని సాయిమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఏసీ కూరగాయల మార్కెట్‌లో గుడ్డ సంచులు పంపిణీ చేశారు. గొల్లకందుకూరులో పొణక హరిప్రసాద్‌రెడ్డి, శివకుమార్ రెడ్డిలు తొమ్మిది ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సౌత్‌మోపూరులో పముజుల ప్రదీప్, రాపూరు చంద్రశేఖర్, తుళ్లూరు రామయ్య, అన్నం సుధాకర్‌గౌడ్, నాశిన ప్రవీణ్‌గౌడ్‌లు మోపూరమ్మ, చౌడేశ్వరిదేవీ ఆలయాల్లో పూజలు చేశారు. కోడూరుపాడులో టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి నేతృత్వంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. పెద్ద చెరుకూరు గ్రామదేవత చెరుకూరమ్మ ఆలయంలో చెన్నారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య, సురేంద్రలు గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అల్పాహారం పంపిణీ చేశారు. 33వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు హజరత్‌నాయుడు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. వావిలేటిపాడులో ఆల్తూరు మస్తానయ్య, ధనలక్ష్మీపురంలో కుంచాల విజయభాస్కర్, మావిళ్ల మధుసూదన్‌రెడ్డిలు పూజలు, ప్రార్థనలు చేశారు. పృథ్వీరాజ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత డీ.రాజానాయుడు ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో రోగులు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జనసేన నేత సుందరరామిరెడ్డి పాల్గొన్నారు. మాదరాజుగూడూరులో ఎంపీపీ విజయకుమార్, సర్పంచు వెంకటేశ్వర్లు, నాయకులు గున్నయ్య, కృష్ణ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 19వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మదన్‌కుమార్‌రెడ్డి మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహించారు.

● నెల్లూరు(వైద్యం): నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులు, సహాయకులకు అన్నదాం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మొగరాల సురేష్, దారా మల్లి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

● నెల్లూరు(సాంస్కృతికం): టీడీపీ నాయకులు బర్నాబాస్, డాక్టర్ ఊరందూరు సురేంద్రబాబుల నాయకత్వంలో నెల్లూరు ద సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాల్వేషన్ ఆర్మీ యూనిట్, నెల్లూరు పాస్టర్ ఫెలోషిప్, పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్, నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ, యేసుతో ఉదయం సభ్యులు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి దుర్గామాల పూజ



భక్తుల సమావేశంలో పాల్గొన్న పెంచలరెడ్డి తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దర్గామిట్టలోని రాజరాజేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి దంపతులు దుర్గామాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 10వ తేదీన దుర్గామాల ధరించిన వేలాదిమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని భజనలు చేశారు. ఈనెల 29న రంగనాయకుల పేట పెన్నానది నుంచి పెన్నా జలాల కలిశాల శోభాయాత్ర జరుగుతుం దని పెంచలరెడ్డి తెలిపారు. అక్టోబరు 1వ తేదీన అయ్యప్పగుడి నుంచి ఇరుముడులు ఊరేగింపు జరుగుతుందని, 2వతేదీ రాజరాజేశ్వరి ఆలయం లో దుర్గామాల విరమణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్తూరు గిరీష్‌రెడ్డి, కొలపర్తి రమేష్‌కుమార్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

● ఎనెల్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ నాగేంద్రప్రసాద్



మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని ఎనెల్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా రోగు లకు మెరుగైన వైద్య సేవ లు అందిస్తున్నామని ఆసుపత్రి మేనేజింగ్ డైరె క్టర్ డాక్టర్ నాగేంద్రప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం ఎనెల్ ఆసుపత్రి మూడవ వార్షికోత్సవం సందర్భంగా వైద్యులు, ఉద్యోగులను సత్కరిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో డాక్టర్ నాగేంద్రప్రసాద్, న్యూరాలజిస్ట్ డాక్టర్ కుంకాళ్ల లావణ్య మాట్లాడుతూ ఆసుపత్రి ప్రారంభిం చినప్పటి నుంచి మెరుగైన వైద్య సేవలతో పాటు ఆధునిక పరికరాలు, సాంకేతికతను ఉపయోగించి అత్యంత నైపుణ్యం కలిగిన బృందంతో అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా కూడా అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ ప్రణీత్, వైద్యులు, ఉద్యోగులు, రోగులు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : దయాడాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉదయం 8 గంటల నుంచి ఆమంచర్లలోని రైతు సేవా కేంద్రంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు హుస్సేన్ కిర్మానీ, ఉపాధ్యక్షులు సలీమ్ సయ్యద్, అంటోనిరాజాలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

జగదేవిపేటలో 'పోషణ' మాసోత్సవాలు



బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సీడీపీవో లక్ష్మి

ఇందుకూరుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట ఎంపీపీ స్కూల్ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ మాసోత్సవాలు - 2025' సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కుటుంబ సభ్యులకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీఓ కె లక్ష్మీదేవి మాట్లాడుతూ వలస వచ్చిన కుటుంబాలకు చెందిన గర్భిణీలకు గుర్తింపు కార్డులు లేకపోయినా పౌష్టికాహారం అందించాలన్నారు. కూలికి వెళ్లే బాలింతలు బిడ్డకు తప్పనిసరిగా తల్లి పాలు ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. తల్లిపాలు రిఫ్రిజిరేటర్ అవసరం లేకుండా నాలుగు గంటలపాటు తాజాగా ఉంటాయని, బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ సుధాకర్‌రావు, స్థానిక టీడీపీ నాయకులు బొల్లినేని రవి నాయుడు, సీహెచ్‌ఓ నందిని, స్థానిక ఏఎన్‌ఎంలు కల్పవల్లి, ధనలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడిరైతు మృతదేహం గుర్తింపు

మనుబోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాలుజారి వాగులో పడిన పాడి రైతు చల్లా చిన్నరమణయ్య (59) మృత దేహం శుక్రవారం బద్దెవోలు కండలేరు వాగులో లభ్యమైందని పోలీసులు తెలిపారు. బద్దెవోలు గ్రామానికి చెందిన చల్లా చిన్నరమణయ్య (59) పశువుల కాపరి. ఇతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అనారోగ్యంతో మంచాన పడిన భార్యను, కుమారుడిని పోషించుకుంటున్నాడు. రోజూలాగే గురువారం ఇంటి నుంచి పొలానికి పశువులను తీసుకెళ్ళాడు. సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో పశువులు వాగులో దిగడంతో, వాటిని అదమాయించేందుకు నీళ్ళల్లో దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. వాగులో తేలిన శవాన్ని స్థానికులు బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాడ వాడలా దుర్గామాతకు విశేష పూజలు



రాపూరు : కన్యకాపరమేశ్వరి అలంకరణలో వాసవీదేవి



బుచ్చి : యోగ నరసింహస్వామిగా కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కా మాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవా లలో భాగంగా కామాక్షితాయి శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరుకు చెందిన ఆరుగుంట హరికిషోర్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. నిత్యాన్నదాన సదనంలో వల్లూరు రవీంద్రారెడ్డి, పెద్ద కామాక్షమ్మ దంపతులు అన్నదానం చేశారు. పెద్దూరులో కొలువైన సీతా, లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి, ఆలయంలో కోదండరాముడు శ్రీ యోగ నరసింహస్వామి అలంకారంలో భక్తుల కు దర్శనమిచ్చారు. రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ వేంకటేశ్వరుడు సంతాన లక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జొన్నవాడ ఆలయంలో దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శుక్రవారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయివార్లను దర్శించుకున్నారు. కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆర్‌జేసీకి స్వాగతం పలికారు. గోత్ర నామాలతో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాలను అందజేశారు.

రాపూరు : దసరా ఉత్సవాలలో భాగంగా పెంచలకోనలోని శ్రీవారి పట్టమహిషి ఆదిలక్ష్మీ అమ్మవారి వైభోగం భక్తుల పాలిట ఆశీస్సులు అందుకుంటున్నారు. శుక్రవారం అమ్మవారు గజలక్ష్మీ అలంకరణలో భక్తులను కటాక్షించారు. గజలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. వాసవీ కన్యకాపర మేశ్వరి ఆల యంలో వాసవీ కన్యకా అమ్మవారి అలంక రణలో దర్శన మిచ్చారు.

పొదలకూరులో మొక్కలు నాటిన యువత

పొదలకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నావూరుపల్లి గ్రామంలో గ్రామ యువత హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ మెంబర్స్ ఎస్సీ, ఎస్టీ కాలనీలో మొక్కలు పంపిణీ చేసి వాటిని నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటినట్లు వెల్లడించారు. సర్పంచ్ వెంగయ్య మాటాడుతూ స్వచ్ఛ మైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడు కోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకు పవిత్ర, దేవరపాటి విష్ణు వర్ధన్‌బాబు, నందం రమ్య, కమల్ తేజ, కుసుమ, నితిన్‌కృష్ణ, యామినిలు మొక్కలు నాటా రు. గుదె రామ కృష్ణయ్య నాయుడు, పసుపులేటి చంద్ర శేఖర్, కాకు పెంచలయ్య, కాకుచిన్న పెంచలయ్య, గుదె వెంకటేశ్వర్లు నాయుడు, చేబ్రోలు దయాకర్, పసుపులేటి శ్రీని వాసులు పాల్గొన్నారు. అందరికీ సర్టిఫికెట్ అందజేశారు.

ఓడీఎఫ్ గ్రామాల్లో తనిఖీలు

మనుబోలు, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): జడ్పీ సీఈవో ఆదేశాల మేరకు మండలంలోని పలు ఓడీఎఫ్ (మరుగుదొడ్డి రహిత) గ్రామాలలో విచారణ బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. మండలంలోని చెరుకుమూడి, ముద్దమూడి, బండేపల్లి, గురివిందపూడి, అనుపల్లిపాడు, వడ్లపూడి, పర్లపాడు, కుడితి పల్లి గ్రామాల్లో ఓడీఎఫ్ కార్యక్రమం కింద గతంలో నిర్మించిన మరుగుదొడ్లపై తనిఖీలు నిర్వహించారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, ఇళ్ళల్లో మరుగుదొడ్లు నిర్మించి ఉన్నారా.. వాటిని వినియోగిస్తున్నారా? వివరాలు సేకరించారు. ఇళ్ళకు వెళ్ళి లబ్ధిదారులను అడిగి వివరాలు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు ఇన్‌చార్జి ఎంపీడీవో బి. విజయ శ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్. ఏఈ. రమేష్, ఈవోఆర్‌డి యశ్వంత్, ఎమ్మార్సీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పొదలకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న స్టేడియంలో ఫ్రెండ్స్ క్రికెట్ వారీ ఆధ్వర్యంతో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మొదటి బహుమతి ప్రదాత స్వర్ణ గార్డెన్స్, ద్వితీయ బహుమతి ప్రదాత (లేట్) వేడిచర్ల మురళి, కుమార్ చందు పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులకు పలు సూచనలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ కూడా క్రీడా స్ఫూర్తితో ఆడాలని, ఆటలో గెలుపోటములు సహజమని ఎటువంటి గొడవలు లేకుండా క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. దసరా సెలవులకు ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నటువంటి ఆర్గనైజర్ మన్నవరపు మనోహర్, తేజ, శ్రీనును అభినందించారు. ఆర్గనైజర్ మనోహర్ మాట్లాడుతూ గెలుపొందిన వారికి మొదట బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆర్ రౌండర్‌లకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధ్యేయం

కొడవలూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్యేయ మని నియోజకవర్గ సాయి టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కొడవలూరు టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు కరకటి మల్లికార్జున, మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గరికపాటి రాజేం ద్రకుమార్, మల్లారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైసీపీ నాయ కుడు, ఆయన అనుచరులు చేసిన అక్రమాల వీడియోను మీడియా ముం దు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతూ వెంకట రమణా రెడ్డి, చెక్క మదన్, జొన్న శివకుమార్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మనుబోలు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళల ఆర్యోగభద్రత కోసం ప్రధానమంత్రిగారు ప్రత్యేక దృష్టితో స్వస్త్ నారీ -సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారని మనుబోలు పీహెచ్‌సీ వైద్యురాలు గేయపూజిత అన్నారు. స్థానిక సచివాలయం-1 పరిధిలో శుక్రవారం వైద్యశిబిరంను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రత్యేకంగా మహిళలకు పలురకాల వైద్యపరీక్షలను చేసి మందులు అందించారు. అలాగే గర్భవతులకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కంచి పద్మమ్మ, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సిహెచ్‌వో రాజయ్య, కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో వ్యాధుల నిర్ధారణ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్నిరకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధులను గురిస్తామని నోడల్ అధికారి డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు వెల్లడించారు. శుక్రవారం నగరంలోని ఆకుతోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ మహిళలకు ఉచిత వైద్య శిబిరాల ద్వారా పలు వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వైలెన్స్ వైద్యాధికారి డాక్టర్ మోనికా స్టేఫి మాట్లాడారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడతామని వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిసింధూర, హెల్త్ సూపర్‌వైజర్ కరుణమ్మ, కమ్యూనిటీ ఆర్గనైజర్ మంజుల పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న సీసీఎస్ డెలిగేట్ సిబ్బంది నిస్సార్ అహ్మద్



అవార్డు అందుకుంటున్న సీసీఎస్ డెలిగేట్ సిబ్బంది నిసార్‌అహ్మద్

రాపూరు, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్ (ఏపీఎస్ టీడీసీ) లోని ఎంప్లాయిస్‌కు సం బంధించి సీసీ ఎస్ అభివృద్ధికి కృషి చేసిన రాపూరు డిపోకు చెందిన సీసీ ఎస్ డెలిగేట్ షేక్ నిస్సార్ అహ్మద్ (కండ క్టర్)కు విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సీసీఎస్ సెక్రటరీ చేతుల మీదుగా అవార్డుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరించారు. సీసీఎస్ డెలిగేట్ షేక్ నిస్సార్‌అహ్మద్‌కు వరుసగా రెండో సంవత్సరం అవార్డు రావడం పట్ల రాపూరు ఆర్టీసీ డిపో కు చెందిన ఉద్యోగులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్వస్థ్‌నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్...

స్వ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కేంద్రం ప్రధాన వైద్యురాలు డాక్టర్ మమత మాట్లాడుతూ స్వస్త్ నారీ స్వశక్తి పరివార్‌లో భాగంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 10 మంది యువత రక్తదానం చేశారని, రక్తదానంతో ఆపదలో ఉన్న వ్యాక్తి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు హరీష్, నజ్మా, రేష్మా, హర్షియా, తదితరులు పాల్గొన్నారు.


నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష గాజులతో అమ్మవారి అలంకరణ


ఉదయగిరి : రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ


వేదగిరి క్షేత్రంలో సంతాన లక్ష్మి


రాపూరు : కోనలో గజలక్ష్మి అవతారం

దేవీ వైభవం

వందే శ్రీచక్ర సంచారిణీమ్...!


సంగం : పసుపు కొమ్ముల అలంకరణలో గంగమ్మ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవా రు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, కన్యకపూజలు, చండీ హోమం జరిగాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి సుజితమ్మ ఆధ్వర్యంలో శ్రేణులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలవర్లకు లక్ష గాజులతో అలంకారం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తికి రాజరాజేశ్వరి అలంకారం కనువిందు చేసింది. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరీ అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం జరిగింది. నెల్లూరు రూరల్ మండలం వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులను కటాక్షించారు.


నెల్లూరు : మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి


కావలి : అన్నపూర్ణా దేవిగా కలుగోళ శాంభవి


సీతారామపురం : ఘటిక సిద్ధేశ్వరంలో మహాలక్ష్మి అలంకరణలో ఇష్టకామేశ్వరి అమ్మవారు

అనికేపల్లిలో చోరీ

వెంకటాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనికేపల్లిలో చోరీ జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనికేపల్లి గ్రామానికి చెందిన గుంజి సంధ్య అనే మహిళ ఐదురోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఇంటికి రాగా, తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించింది. చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించింది. సీఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి అనికేపల్లికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును క్షుణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందాన్ని పిలిపించి వేలిముద్రాలు సేకరించారు. చోరీకి గురైన బంగారం విలువ రూ. 2.35 లక్షల వరకు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాతా, శిశు మరణాలు నివారించాలి : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా, శిశు మరణాలను పూర్తిగా నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగిన సబ్ కమిటీ సమావేశంలో ఒక మాతృ మరణం, 9 మంది శిశు మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి గర్భిణీని గుర్తించి వారి పేరు నమోదు చేసి అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణిని గుర్తించి వారికి ఎటువంటి ఆటకం లేకుండా సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖ ప్రసవం జరిగేలా సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకులు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. ప్రతి గర్భిణీకి జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. ఏ తల్లీ బిడ్డ రక్తహీనత వలన, సకాలంలో వైద్య సేవలు అందక మరణించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ, జీజీహెచ్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ విజయ్, డాక్టర్ గ్రేస్ ప్రియాంక, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ రామ్ కిశోర్, డాక్టర్ సంధ్య, డాక్టర్ రమేష్, డెమో కనకరత్నం పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

కిలాడీ కృష్ణ

- నకిలీ హోదాలతో సాయికృష్ణ మోసాలు
- ఇన్‌స్పెక్టర్, డాక్టర్... అంటూ టోకరా
- నిరుద్యోగులకు మాయ మాటలు
- ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల దోపిడీ
- నిందితుడు, సహకరించిన తండ్రి అరెస్ట్



నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అతనే పోలీసు ఇన్‌స్పెక్టర్.. అతనే డాక్టర్.. ప్రొఫెషనల్ ముసుగులో వైట్ కాలర్ నేరాలు అతని నైజం, నిరుద్యోగులే లక్ష్యం. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపి మాయమాటలు చెప్పి రూ.లక్షలు వసూలు చేస్తాడు. ఆ కిలాడీ నకిలీ ఆఫీసర్ పేరు దేవళ్ల సాయి కృష్ణ. నెల్లూరులోని పొదలకూరురోడ్డు శివాజీ నగర్ రాయల్ అపార్ట్‌మెంట్‌లో ఉంటాడు. తప్పులు చేయొద్దని బుద్ధిచెప్పాల్సిన తండ్రే, కొడుకు మోసాలకు సహకారం అందించడం విశేషం. వీరిద్దరినీ శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు.

నెల్లూరులోని న్యూమిలిటరీ కాలనీకి చెందిన తూపిలి వినోద్ కుమార్ బీటెక్ చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ప్రస్తుతం డైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఆయన మామ ప్రసాద్ నిర్వహిస్తున్న టీ బ్రేక్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆ దుకాణానికి దేవళ్ళ సాయికృష్ణ వస్తూ ఉండేవాడు. తాను విజయవాడలో క్రైమ్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, తనకు డబ్బులు ఇస్తే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని వినోద్‌కుమార్‌ను నమ్మించి పలు దఫాలుగా రూ.11 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం మాత్రం ఇప్పించకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. తనలాగే ఎన్‌సీసీ కాలనీకి చెందిన పోలిరెడ్డి పావని, భారతి, దగదర్తికి చెందిన కే హేమంత్‌కు కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని సాయికృష్ణ రూ.40 లక్షలు తీసుకొని మోసం చేశాడని తెలుసుకుని ఈ నెల 24న వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శుక్రవారం దేవళ్ళ సాయికృష్ణతో పాటు అతనికి సహకరించిన అతని తండ్రి పోలయ్యను అరెస్ట్ చేశారు. డీ సాయికృష్ణ క్రైమ్ ఇన్‌స్పెక్టర్, విజయవాడ పేరుతో ఉన్న ఐడీ కార్డు, డాక్టర్ జె సాయిపార్థసారథి రెడ్డి, న్యూరో అండ్ ఆర్థో సీనియర్ డాక్టర్ పేరుతో ఉన్న నకిలీ ఐడీ కార్డు, ఖాకీ దుస్తులు, బూట్లు, ఇతర వస్తువులు, ఒక కారు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా అధికారులు అభినందించారు.

వేతన వేదన

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు అందని జీతాలు
- 800 మంది ఎదురుచూపులు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అందరూ చదవాలి....అందరూ ఎదగాలి అనే నినాదంతో ముందుకు సాగుతున్న సమగ్రశిక్ష విభాగంలో ఉద్యోగులు జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. విద్యాబోధనతోపాటు విద్యాశాఖ కార్యాలయాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాల అమలుకు పనిచేస్తున్న సిబ్బందికి అక్టోబర్ నాటికి రెండు నెలల జీతాలు పెండింగ్ ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 800 మంది ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల జీతాలు కేంద్ర బడ్జెట్ ఆమోదంపై ఆధారపడి ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు సమకూర్చకపోగా కేంద్రం ఇస్తున్న వాటినీ వాడేస్తున్నందునే తమకు వేతన కష్టాలని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జీతాలు రాకపోతే ఈ ఏడాది తమ ఇళ్లలో దసరా పండుగ లేనట్లేనని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు వినతులు అందచేశామని, వెంటనే జీతాలు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



చేపల దొంగ పోలీసులకు అప్పగింత

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో గత కొంతకాలంగా దొంగతనంగా చేపలు పట్టుకుని వెళ్తున్న నిందితుడ్ని యజమాని కాపుకాచి పట్టుకుని శుక్రవారం పోలీసులకు అప్పగించిన సంఘటన జరిగింది. వివరాల మేరకు... సంగంలోని బీరాపేరు ఒడ్డున కృష్ణా జిల్లాకు చెందిన ఏసు అనే వ్యక్తి చేపల చెరువులు లీజుకు తీసుకుని చేపల సాగుచేస్తున్నాడు. గత కొంతకాలంగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంగా చేపలు పట్టుకుని వెళ్తున్నట్లు యజమాని గుర్తించాడు. దీంతో ఎలాగైనా పట్టుకోవాలని కొంతదూరంలో ఉండి పగలు, రాత్రి కాపలా కాస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ యువకుడు చేపల చెరువులో వల వేసి చేపలు పడుతుండగా గమనించిన యజమాని పట్టుకునేందుకు చేపల చెరువు వద్దకు రాగా నిందితుడు తప్పించుకునేందుకు కాలువలో దూకి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో అక్కడున్న వారు చుట్టుముట్టి నిందితుడితోపాటు వల, చేపలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించగా నిందితుడు సిద్దీపురం గ్రామస్థుడిగా తెలిసింది. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు.


వల వేసి పట్టిన చేపలు, నిందితుడు వెంకటేశ్వర్లు



చెత్త తొలగింది!

జిల్లా పాలనా కేంద్రమైన కలెక్టరేట్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు పెరిగిపోయాయంటూ 'చెత్త శుద్ధి ఇదేనా?' శీర్షికతో ఈ నెల 23న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి యంత్రాంగం స్పందించింది. అధికారులు స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించి కలెక్టరేట్ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. వ్యవసాయాన్ని సులభతరం చేయడానికి రోటావేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, కట్టర్లు, లెవలింగ్ బ్లేడ్స్ తదితర వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో సాగులో లేని 70వేల ఎకరాల భూములను సాగులోకి తీసుకురావటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడులో రాగి తేజ అనే గిరిజనుడి పూరిల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. తేజ ఎస్టీ కాలనీలో పూరిల్లు వేసుకుని కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి టీవీ చూసేందుకు సమీపంలోని తండ్రి ఇంటికి భార్యా పిల్లలందరూ వెళ్లారు. ఉన్నటుండి ఇంట్లో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కలవారు చూసి తేజకు తెలిపారు. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చేటప్పటికి ఇంట్లోని సామగ్రి, కొంత నగదు, బంగారు వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మోటారు బైక్ బోల్తా : ఒకరికి గాయాలు

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉడ్‌హౌస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ముంబాయి జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మోటారు బైక్ బోల్తా పడింది. ఈ సంఘటనలో మోటారు బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల మేరకు... గుర్తుతెలియని వ్యక్తి మోటారుబైక్‌పై సంగం వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి మోటారుబైక్ బోల్తా పడడంతో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితున్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు అపస్మారక స్థితిలో ఉండడంతో వివరాలు తెలియరాలేదు. ఆమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మోటారు బైక్ బోల్తాపడి గాయపడిన వ్యక్తి

రీసర్వే బాధితులకు న్యాయం చేయండి

- వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



కలువాయి, (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలం మాదన్నగారిపల్లె పంచాయతీలోని రైతులకు వైసీపీ హయాం లో చేసిన రీసర్వే శాపంగా మారిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రాష్ట్ర శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. రామ న్నగారిపల్లి, మాదన్నగారిపల్లి గ్రామాల్లో 30 ఏళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన సుమారు 200 మందికి 400 ఎకరాలు డీ ఫారం పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రైతులు రుణాలు కూడా తీసుకుంటున్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే తరువాత ఆ భూములను రికార్డులలో ప్రభుత్వ భూములుగా నమోదు చేయడంతోపాటు వాటిని హోల్డ్‌లో ఉంచారు. బ్యాంకుల్లో రైతు లు తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే రైతుల పేర్ల మీద భూములు లేవు. దీంతో పేద రైతులకు అప్పటి నుంచి రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల పేర్ల మీద రికార్డులలో ఎక్కించేందుకు సీసీఎల్ఏకు జేసీ ప్రతిపాదనలు పంపారు. దీనికి సీసీఎల్ఏ నుంచి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో రైతుల కు అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందకుండా పోయాయి. రెవెన్యూ మంత్రి స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలి.



నిధుల పరిమితిని పెంచేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలి

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఉదయగిరి/జలదంకి, (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మురుగు కాలువల నిర్మాణానికి నిధుల పరిమితి పెంచేలా సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో కోరారు. ఉపాధి నిధులతో నిర్మించి సిమెంట్‌రోడ్ల పక్కనే మురుగు కాలువల నిర్మాణానికి సాఫ్ట్‌వేర్‌లో పరిమితి రూ.లక్ష వరకు మాత్రమే ఉందన్నారు. వంద మీటర్ల మురుగు కాలువ నిర్మాణానికి రూ.4 లక్షల వరకు నిధులు అవసరమవుతాయన్నారు. నిధుల పరిమితిని రూ.5-50 లక్షలలోపు పెంచడంతోపాటు అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహారీల నిర్మాణం కోసం నిధుల వ్యయాన్ని పెంచాలని కోరారు. ఈ అంశంపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయం నుంచి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందన్నారు.

బిట్రగుంటలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలి

- కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి



కావలి, (ఆంధ్రజ్యోతి) : బిట్రగుంటలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యాలు ఏర్పడి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన క్రిష్ణపట్నం పోర్ట్, త్వరలో ప్రారంభం కానున్న రామాయపట్నం పోర్ట్, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, అలాగే త్వరలో ఏర్పడనున్న దామవరం ఎయిర్‌పోర్ట్, అర కి.మీ దూరంలో జాతీయరహదారులు బిట్రగుంటకు అందుబాటులో ఉన్నాయన్నారు. బిట్రగుంట లో 925 ఎకరాల రైల్వే భూమి ఖాళీగా ఉందని, అక్కడ మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తే కంటైనర్ డిపోలు, గోదాములు, ప్యాకింగ్ సెంటర్లు, బ్రేకింగ్ యార్డులు అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఈ పార్క్ ద్వారా రవాణా సౌకర్యాలు విస్తరించి రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలకు సరుకులు త్వరగా చేరుతాయన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10,851
వెండి కిలో ధర	రూ. 1,42,000
వెండి ఒక గ్రాము	రూ.145.00

కార్మిక చట్ట సవరణ బిల్లు ఆపాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మికులకు 10 గంటల పని విధానంపై అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమని, కార్మిక చట్ట సవరణ బిల్లు ఆపాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ట్రంకు రోడ్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రెహనాబేగం, పెంచలయ్య, కృష్ణమోహన్, తిరుపాలు, మధుసూదన్‌రావు, యూనియన్ నాయకులు క్రాంతికుమార్, సుభాషిణి, జయంతి, చిన్నమ్మ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జాషువా సాహితీ పురస్కారానికి మస్తానయ్య ఎంపిక

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంగీత, సాహిత్య వేదిక అధ్యక్షుడు, తెలుగు ఉపాధ్యాయుడు, స్నేహ మధురిమలు పుస్తక రచయిత ఇనకొల్లు మస్తానయ్య జాషువా సాహితీ పురస్కారానికి ఎంపికైనట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీన గుర్రం జాషువా జయంతి సందర్భంగా గుంటూరులో జరిగే కార్యక్రమంలో మస్తానయ్యకు పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు. తనను జాషువా సాహితీ పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులకు మస్తానయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారులపై దౌర్జన్యం చేస్తే చట్టపరమైన చర్యలు : సీఐ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులపై దౌర్జన్యం చేసి డబ్బులు వసూలుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కందుకూరు సీఐ అన్వర్ బాషా శుక్రవారం హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. షాపుల ప్రారంభోత్సవాలు, వివాహలు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు, ఇతరుల వద్దకు వెళ్లినప్పుడు కానీ బలవంతంగా డబ్బులు వసూలుచేయడం, వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం చేయకూడదని, వారికైవారు డబ్బులు ఇస్తేనే తీసుకోవాలని, వారి నుంచి బలవంతంగా డబ్బులు లాక్కోవడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

పాథాలజిస్టు పోస్టు భర్తీ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పాథాలజిస్టు (వ్యాధి నిర్ణయ శాస్త్రవేత్త) పోస్టు భర్తీ చేస్తూ శుక్రవారం వైద్యఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా, అనపర్తి ఏరియా ఆసుపత్రి నుంచి పాథాలజిస్టు డాక్టర్ దినేష్ కింకెర్‌ని కందుకూరు ఏరియా ఆసుపత్రికి నియమిస్తు ఉత్తర్వులు జారీ అయినట్లు అధికారులు తెలిపారు.

నాణ్యమైన పొగనారు ఉత్పత్తి చేయాలి

కలిగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొగాకు నారుమళ్లు సాగుచేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన నారును ఉత్పత్తి చేయాలని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. బోర్డుపరిధిలోని జువ్వలగుంటపల్లిలో శుక్రవారం పొగాకు నారుమళ్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి మాత్రమే పొగాకు ఎగుమతులు ఉంటాయన్నారు. బోర్డు అనుమతించిన మేర మాత్రమే పొగాకు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంల్లో ఫీల్డ్ అఫీసర్ సంతోష్‌కుమార్, ఐటీసీ, జీపీఐ కంపెనీ ప్రతినిధులు గోలి వెంకటేశ్వర్లు, ఆలీ, బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో భద్రకాళి



కలిగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెల్లపాడు గ్రామంలో భద్రకాళి అమ్మవారు శుక్రవారం భక్తులకు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. శతనామావళి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మారెళ్ళ పెదమాల్యాద్రిరెడ్డి, పద్మావతి, మహదేవరెడ్డి, మమత ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏఎస్ పేట మండలం, చౌటభీమవరం వాస్తవ్యులు చింతపట్ల అంకయ్య, పూర్ణలక్ష్మి దంపతులు రూ.10 వేల విలువైన వెండి తీర్థపాత్రను ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు శ్రీనివాసాచార్యులకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి వేదాశీర్వచనం అందజేశారు.

బిట్రగుంట: బోగోలు మండలంలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రుల సదర్భంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. బోగోలు రాజావీధి షిరిడి సాయిబాబు మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి, చెంచులక్ష్మీపురం పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అల్లూరు : శుక్రవారం అల్లూరులోని పార్వతీ అమ్మవారి దేవాలయం (దసరా దేవాలయం)లో పార్వతీ అలంకారంలో అమ్మవారు రథంలో గ్రామోత్సవానికి తరలివెళ్లారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ, కన్యకా పరమేశ్వరి, వృక్ష పోలేరమ్మ ఆలయాల్లో శుక్రవారం రాత్రి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కావలి (టౌన్): దేవీ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నంది వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో, కొత్త బజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలకారంలో దర్శనమిచ్చారు. మహిళా భక్తుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



బృందావనం కాలనీలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగం గా శుక్రవారం శ్రీవారు సింహ వాహన, ముత్యపు పందిరి వాహన సేవలందుకున్నారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు శ్రీరా మ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల యాగ్నికస్వామి పరాంకుశం చినవెంకటస్వామి యాగ్నికంలో టీటీడీ ఆచార వ్యవహారాలతో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం శ్రీవారికి సింహ వాహన, రాత్రి ముత్యపు పల్లకి వాహన సేవలందించారు. శనివారం ఉదయం స్వామివారికి కల్పవృక్ష వాహన ఉత్సవం, రాత్రి సర్వభూపాల వాహన ఉత్సవం జరగనున్నాయి.

రూ.30లక్షల కరెన్సీతో అలంకరణ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కోవూరు రోడ్డులో వేంచేసి ఉన్న దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు, ఆలయ నిర్వాహకులు రూ.30,01,116 కొత్త కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. విశేష అంకరణలో అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పణ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రుల సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పించారు. ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు కందుకూరు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల అధ్యక్షుడు కోట నరసింహంతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా పల్లపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా బొగ్గవరపు సుబ్బారావు ఎన్నికైన సందర్భంగా జిల్లాలోని అన్ని వాసవి అమ్మవార్లకు సారె సమర్పించాలనే తలంపుతో మొదటిగా కందుకూరుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. తొలుత పట్టణంలోని పొట్టిశ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

లక్ష్మీదేవి అలంకారంలో అంకమ్మతల్లి

లింగసముద్రం, సెప్టంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంకమ్మతల్లి దేవస్థానంలో లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విలేకరి స్థలం కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జర్నలిస్టులకు పట్టాలు పంపిణీ చేసిన స్థలాలకే రక్షణ లేకుంటే సామాన్య ప్రజల ఆస్తులకు రక్షణ ఏవిధంగా చేపడతారని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన కందుకూరు ఆంధ్రజ్యోతి సీనియర్ విలేకరి కొల్లూరి హరిబాబు స్థలాన్ని పరిశీలించిన ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని, రెవెన్యూ, పోలీసు అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని ప్రకటనలో కోరారు.

కరేడు భూసేకరణ బిల్లు రద్దు చేయాలి

● సీపీఐ నిరసన

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇండో సోలార్ కంపెనీ భూసేకరణకు ఇచ్చిన జీవో.43ను రద్దు చేయాలని, కరేడు రైతులకు న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామ అంకయ్య మాట్లాడుతూ కరేడులో ఇండో సోలార్ కంపెనీకి భూసేకరణ విషయంలో జూలై 4న జరిగిన గ్రామసభలో గ్రామస్థులంతా భూములు ఇవ్వమని తీర్మానం చేసినా, ప్రభుత్వం బెదిరించి భూమలు తీసుకుంటోందని, భూములు ఇవ్వని వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. బాధిత రైతులను పరామర్శించడానికి గ్రామాల్లోకి వెళ్లకుండా పోలీస్ 30 యాక్ట్ విధించడం శోచనీయమన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం సబ్ కలెక్టర్ దామెర హిమవంశీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు, నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాన్‌వాజ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిషోర్, సాల్మన్‌రాజ్, కొండలరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం : డాక్టర్ శ్రీనివాసులు

కావలి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని చౌదరిపాలెంలో టీడీపీ నాయకులు గోరంట్ల రాంబాబు, పోకూరు రాంబాబు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. తుమ్మలపెంట వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హిమదీప్తి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ప్రత్యేక స్టాల్ ద్వారా పౌష్టికాహార ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు గోరంట్ల రాంబాబు, పోకూరు రాంబాబు, మండువ వాసు, బత్తుల రవి, గొంది చందు, మందలపు వెంకట సుబ్బయ్య, చిడిపోతు వెంకటేశ్వర్లు, కోడెల క్రిష్ణ, మండువ శ్రీనివాసులు, కారుమూడి కిరణ్, మండువ శ్రీనివాసులు, యార్లగడ్డ జీవన్, కంటు రమేష్‌బాబు, కొత్ర పాటి శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

లింగసముద్రం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టిహారంపై అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపవని సెక్టారులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజాత శిశువు, కిశోర బాలికలు పట్ల చూపాల్సిన శ్రద్ధాశక్తుల గురించి తల్లులకు వివరించినట్లు సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయం

బిట్రగుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య రక్షణే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని కోవూరుపల్లి వైద్యులు రామకృష్ణ, నళిని పేర్కొన్నారు. కోవూరుపల్లి ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

బిట్రగుంట అభివృద్ధిపై 'దగుమాటి' గళం హర్షణీయం

బిట్రగుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే ప్రాంతంలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అసెంబ్లీలో గళం వినిపించడం హర్షణీయమని టీడీపీ మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ పాలనలోనే రామయ్యపట్నం హార్బర్, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. సమావేశంలో కూటమి నాయకులు ఎస్ శ్రీని వాసులు యాదవ్, ఎల్ సుధీర్‌బాబు, జీ నాగరాజు, మస్తాన్‌నాయుడు, బాషా, బిట్రగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పీ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో వసతుల పరిశీలన



సచివాలయంలో వసతులను పరిశీలిస్తున్న పీడీ నాగరాజకుమారి

ఉదయగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సచివాలయం-3ని శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్-2047లో భాగంగా ఉదయగిరి నియోజకవర్గానికి తాను ప్రత్యేకాధికారిణిగా వ్యవహరిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ఓ కేంద్రాన్ని ఏర్పాటుచేసి అక్కడనుంచి 8 మండలాల్లో కార్యకలాపాలు కొనసాగించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా వింజమూరు, ఉదయగిరి సచివాలయాల్లో వసతులు పరిశీలించినట్లు, నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి అనంతరం కేంద్రం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పంచా యతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐలమ్మ సేవలు ఎనలేనివి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రజకుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన చాకలి ఐలమ్మ సేవలు ఎనలేనివని మండల రజక సంఘం అధ్యక్షుడు మాచర్ల గురవయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు యాదగిరి హజరత్, సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు యాదగిరి ప్రసాద్, యాదగిరి తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాలను, నీటి తొట్టెలను పరిశీలించి వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి అలంకారాలు

భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు



వరికుంటపాడులో సంతానలక్ష్మి అలంకారంలో నాగరప్పమ్మ



తూర్పురొంపిదొడ్లలో స్కందమాత అలంకారంలో మానసాదేవి



సంగం : కాత్యాయనిదేవి అలంకారములో శ్రీ కామాక్షీదేవి



ఆత్మకూరు : అన్నపూర్ణాదేవి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు

ఉదయగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకారాలలో భక్తులకు కనువిందు చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీపరమేశ్వరాలయంలో రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు స్కందమాత అలంకరణలో, వరికుంటపాడులోని నాగరప్పమ్మ సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● **సంగం :** స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో అమ్మవారు శుక్రవారం రాత్రి లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరించారు. పల్లకీసేవ నిర్వహించారు.

● **ఆత్మకూరు :** పట్టణంలోని ఉత్తర బలిజ వీధిలో ఉన్న జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో, గ్రామదేవత అంకాలమ్మ గుడి నారాయణమ్మపేట విజయ కనకదుర్గాదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు మహలక్ష్మీ అలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాలమ్మ గుడి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళలకు ఆరోగ్య సంరక్షణ పరీక్షలు



అంగన్‌వాడీలు చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా మహిళలకు ఆరోగ్య సంరక్షణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి ఆయేషా తెలిపారు. శుక్రవారం తూర్పుకొండారెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించి అభినందనలు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు, వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచు ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు ఖాశింబీ, రేష్మ, కార్యకర్తలు తిరుపతమ్మ, రజియా, మిరియమ్మ, పద్మావతి, చిన్నమ్మ, శైలజ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

సీతారామపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్ ఫజిహా అన్నారు. ఆమె శుక్రవారం సింగారెడ్డిపల్లి బీసీ కాలనీలో సర్వే నంబర్ 96లోని వివాదాస్పదమైన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో యంత్రాలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుభాని, సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్వో వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనంతో కార్మికులకు ఒరిగిందేమీ లేదు : ఎస్‌డబ్ల్యూఎఫ్



మహాసభలో మాట్లాడుతున్న కట్టా సుబ్రహ్మణ్యం

ఉదయగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా కార్మికులకు ఒరిగిందేమీలేదని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఉదయగిరి డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ 10వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో చేపట్టిన వేతన సవరణ వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. 20 శాతం ఉన్న హెచ్ఆర్ఏ 16 శాతానికి తగ్గించారన్నారు. గత ప్రభుత్వం కార్మికులకు సరైన పద్ధతిలో న్యాయం చేయకపోవడంతో కార్మికులంతా కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారన్నారు. వారు కూడా అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన చేస్తున్నారన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రాజశేఖర్, ఏ.కృష్ణయ్య, యస్థానిబాషా, రవి, కాకు వెంకటయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గు చూపాలి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబు 26 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం కలిగిన చిరుధాన్యాల సాగు చేసి లాభాలు పొందాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురంలో జొన్నపంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాల వాడకం అధికమైందని, ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్, వీఏఏ దినేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): పంటల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జీకొండారెడ్డిపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంట సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే పంటకు వ్యాపించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా సిద్దీపురం గ్రామంలో మధ్యాహ్నం వైద్య శిబిరం నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సీతారామపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను మండల వైసీపీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, దంతిక జయపాల్ , గిరి, కొండయ్య, పిచ్చయ్య. ఓబులేస్. ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

సీతారామపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామ సమీపాన గల జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పబ్బులేటిపల్లి నుంచి సీతారామపురానికి బయలుదేరిన ఆటో మార్గమధ్యంలో జాతీయ రహదారిపై అడ్డొచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సీతారామపురం గ్రామానికి చెందిన వీరపోగు బాబు, నారాయణలకు గాయాలు కాగా 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరిసాగుపై రైతులకు అవగాహన

అనంతసాగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో శుక్రవారం వరిసాగును వ్యవసాయాధి కారులు పరిశీలించారు. ఎన్ని రోజులకు కోత కోయాలి, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శైలజా కుమారి, ఏఈవో కృష్ణవేణి పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలలో నేడు :

ఉదయం: 8-10మధ్య
కల్పవృక్ష వాహనం
మధ్యాహ్నం: 1-3మధ్య
స్నపన తిరుమంజనం
రాత్రి: 7-9మధ్య
సర్వభూపాల వాహనం

కాళీయమర్దనుడిగా మలయప్ప కటాక్షం

● పెరిగిన భక్తుల రద్దీ



బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం ఉదయం సింహవాహనంపై యోగనరసింహుడిగా దర్శనమిచ్చిన మలయప్ప.. రాత్రి ముత్యపుపందిరిలో కాళీయమర్ధనుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. తెల్లటి ముత్యాల నడుమ విశేష అలంకరణలో శ్రీ,భూ సమేతుడై గ్యాలరీల్లో ఉన్న భక్తులను అనుగ్రహించారు. ఉదయం, రాత్రి వాహన సేవల్లో భక్తులు అధికంగా పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఇక, బుధ, గురువారాల్లో తిరుమలలో భక్తుల రద్దీ చాలా సాధారణంగా కనిపించింది. శుక్రవారం మాత్రం రద్దీ పెరిగింది. ఉదయం వాహన సేవలోనే భక్తులు గ్యాలరీల నిండుగా కనిపించారు. రాత్రి వాహన సేవకు రెట్టింపయ్యారు. వాతావరణం చల్లగా ఉండడంతో టీటీడీ అందజేసిన అన్నప్రసాదాలు స్వీకరిస్తూ గ్యాలరీల్లోనే కూర్చుండిపోయారు. కళాబృందాలు కూడా ఉదయం కంటే రాత్రి వాహనసేవలో మరింత ఉత్సాహంతో ప్రదర్శనలిచ్చాయి. పెరటాసి రెండవ శనివారంతో పాటు ఆదివారం గరుడసేవ కావడంతో రద్దీ క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి రద్దీ మరింత పెరిగే అవకాశముందని టీటీడీ అంచనా వేస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





తగ్గిన హుండీ ఆదాయం

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం బుధవారం ధ్వజారోహణం రోజున బాగా తగ్గింది. ఉపరాష్ట్రపతి, సీఎం సహా వీవీఐపీలు చాలా మంది తిరుమలలో ఉన్న ఆరోజు భక్తుల సంఖ్య 58వేలు మాత్రమే. గురువారం పరకామణి లెక్కింపులో రూ.1.74 కోట్లు లభించింది. గత రెండేళ్లలో ఒకేరోజు ఇంత తక్కువ హుండీ ఆదాయం ఇదే మొదటిది.

ముక్కంటి హుండీలో నగదు చోరీకి యత్నం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్కంటి సన్నిధిలోని హుండీలో శుక్రవారం ఓ భక్తుడు సమర్పించే నగదును తస్కరించేందుకు యత్నించిన వ్యక్తి పట్టుబడ్డాడు. అన్నమయ్య జిల్లా రామసముద్రం గ్రామానికి చెందిన వీరప్ప నారాయణ శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చాడు. స్వామి దర్శనానంతరం సహదేవరెడ్డి అనే భక్తుడు రూ.200 హుండీలో వేస్తుండగా.. అక్కడే చేయి పెట్టిన వీరప్ప.. ఆ భక్తుడు వదలిన రూ.200 నోటును పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని సహదేవరెడ్డి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వీరప్ప నారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి వెల్లడించారు.

నారావారిపల్లె ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంపు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ప్రస్తుతమున్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతూ అదనంగా 18 పోస్టులు ఏర్పాటు చేయాలని గత నెల 19న ఏపీ స్టేట్ సెకండరీ హెల్త్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనిపై కసరత్తు చేసిన ప్రభుత్వం రాష్ట్రంలోని 50 పడకల కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సిబ్బంది సంఖ్యను సమీక్షించి సర్దుబాటు చేసింది. అందులో భాగంగా డెంటల్, గైనిక్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆప్తాల్మజీ వంటి తొమ్మిది విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులను, నాలుగు కింది స్థాయి సిబ్బంది పోస్టులను, ఐదు స్టాఫ్ నర్సు పోస్టులను నారావారిపల్లెకి సర్దుబాటు చేసింది. మొత్తం 18 అదనపు పోస్టులతో నారావారిపల్లె ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతూ శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అధ్యక్షా..



పరిశ్రమల్లో స్థానికులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించాలి

పరిశ్రమల్లో స్థానికేతరులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్థానికుల పొట్ట కొడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమల్లోనైనా స్థానికులకు 30 శాతం రిజర్వేషన్ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. భూములిచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సహకరించిన స్థానికులకు న్యాయం చేయాలి.


- సుధీర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే



టీడీపీ సానుభూతిపరులని అసైన్‌మెంట్ భూములను హోల్డ్ చేశారు

ఉమ్మడి నెల్లూరు జిల్లా కలువాయి మండలం మాదన్నగారిపల్లి, రామన్నగారిపల్లి గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన 200 మంది రైతులకు 30 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేశారు. వీరు సాగు చేసుకుంటూ, బ్యాంకుల నుంచి రుణాలూ తెచ్చుకున్నారు. ఈ రైతులు టీడీపీ సానుభూతిపరులని, వైసీపీ హయాంలో ఆ భూములను ప్రభుత్వ రికార్డుల్లో నుంచి తొలగించి హోల్డ్‌లో పెట్టారు. దీనివల్ల వన్ బీ రాకపోవడంతో బ్యాంకు రుణాలను రెన్యువల్ చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టి రైతులకు న్యాయం చేయాలి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే



దేవుణ్ని చూడగానే కళ్లల్లో నీళ్లొచ్చాయి

● బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్

'దేవుణ్ని చూడగానే కళ్లలోంచి నీళ్ల తన్నుకుని వచ్చాయి. గొప్ప సంతోషంతో మనసు నిండిపోయింది. అదొక దివ్యానుభూతి' అని తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనం తర్వాత బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అన్నారు. శుక్రవారం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, స్వామిని చూసి బయటకు వచ్చిన తర్వాత మనసు మొత్తం దేవుడి ప్రేమ, రూపం నిండిపోయాయన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేసిన అలంకరణలు చాలా బాగున్నాయన్నారు. కాగా, అంతకుముందు సినీనటి వాసుకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జీఎస్టీ ఫలాలు ప్రతి గడపకూ చేరాలి

ప్రజల్లో అవగాహన కల్పించండి

● జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 తగ్గింపు ఫలాలు ప్రతి గడపకూ చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రయోజనాలపై అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చాలా వస్తువులపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించిందని తెలిపారు. తగ్గిన ధరలు జిల్లాలోని ప్రతిగడపకూ చేరాలని సూచించారు. దీనిపై జిల్లాలో నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, డిప్యూటీ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి గ్రామకంఠాలకు విముక్తి

● శ్రీకాళహస్తిలో 22ఏ నుంచి 630 ఎకరాల తొలగింపు



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితా నుంచి గ్రామకంఠాలకు విముక్తి లభిస్తోంది. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లో 630 ఎకరాలను 22ఏ నుంచి తొలగించడంతో ఈ ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా రెండు వేల ఎకరాలను తొలగించి పేదలకు లబ్ధి కలిగించే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. గతంలో గ్రామకంఠంలో ఇళ్లు కట్టుకున్న భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూసదస్సుల్లో గ్రామకంఠాల్లో నివసిస్తున్న వారి నుంచి కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లోని 192 గ్రామ కంఠాల్లో ఉన్న 630 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్లు ఆయా గ్రామాలను సందర్శించి పునఃసర్వే చేసి భూముల వివరాలను అప్‌డేట్ చేశారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆయా గ్రామాల్లోని 19వేల కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఇక, వీరు ఆయా భూములపై బ్యాంకు రుణాలు పొందడంతో పాటు రిజిస్ట్రేషన్లూ చేసుకోవచ్చు. ఇలా జిల్లా వ్యాప్తంగా నిషేధిత జాబితాలో ఉన్న గ్రామకంఠాల్లోని రెండు వేల ఎకరాలకుపైగా ఉన్న భూములను 22ఏ నుంచి తొలగించి పేదలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ చెప్పారు.

'సీమ'లో ఒకే ఒక్కడు

● కామర్స్ పీజీటీ పోస్టు దక్కించుకున్న గిన్నె రవిశంకర్



డీఎస్సీలో కామర్స్ పీజీటీ పోస్టులు రాష్ట్రానికంతా ఉన్నదే నాలుగు. అందులో రాయలసీమ జోన్-4 ప్రాంతంలో ఉన్నది ఒక పోస్టే. ఈ నాలుగు పోస్టులకు పోటీ పడింది 354 మంది. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఒక పోస్టును దక్కించుకున్నారు తిరుపతికి చెందిన గిన్నె రవిశంకర్. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాల ఇన్‌స్ట్రక్టర్ గిన్నె సాగర్, అలివేలు కుమారుడు, పూలవానిగుంటకు చెందిన రవిశంకర్.. ఎస్వీయూలో ఎంకాం చదివారు. ఆ తర్వాత బీఈడీ చేశారు. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్‌లో పీజీటీ (అకౌంటెన్సీ)గా పనిచేస్తున్నారు. మెగా డీఎస్సీలో ఆదర్శ పాఠశాలల్లో కామర్స్ పీజీటీ పోస్టులు రాష్ట్రంలో నాలుగంటే నాలుగు ఖాళీగా ఉన్నాయి. పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టుదలతో సాధన ప్రారంభించారు. 62.05 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో.. రాయలసీమజోన్ స్థాయిలో ఒకటో స్థానంలో నిలిచారు. ఇలా రాయలసీమ జోన్‌లో ఉన్న ఒకేఒక్క పోస్టును కైవసం చేసుకున్నారాయన. 'మెగా డీఎస్సీలాంటి బంగారు అవకాశాన్ని వదులుకోకూడదని భావించా. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని రోజుకు 6 నుంచి 8 గంటలు చదివా. రాష్ట్రంలోని నాలుగు పోస్టుల్లో ఒకటి సాధించడం చాలా ఆనందంగా ఉంది' అని రవిశంకర్ పేర్కొన్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

శరన్నవరాత్రి అలంకరణలు



తిరుపతి: మహాలక్ష్మిగా తాతయ్యగుంట గంగమ్మ



శ్రీకాళహస్తి: శ్రీలలితాదేవిగా కనకదుర్గమ్మ

సూళ్లూరుపేట: మహాలక్ష్మిగా చెంగాళమ్మ అమ్మవారు





చిల్లకూరు: కాత్యాయిని దేవిగా తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి


సూళ్లూరుపేట: ప్రత్యేకాలంకరణలో మన్నారుపోలూరు చెంగాళమ్మ, బాలత్రిపుర సుందరిగా పార్వతీదేవి - నాయుడుపేట: మహాలక్ష్మిగా మూకాంబికాదేవి

మహాలక్ష్మిగా చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చెంగాళమ్మ పరమేశ్వరి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాలంకరణ చేశారు. బాపూజీ వీధి, గాండ్ల, పార్కు, కచ్చేరివీధికి చెందిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారానికి ఓడూరు మునికృష్ణారెడ్డి, పావని, చండీయాగానికి యర్రం హనుమా రెడ్డి, హిమబిందు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. వేనాటి సురేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికా దేవి, పోలేరమ్మ, దుర్గాదేవి, కన్యకాపరమేశ్వరి, అంకమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మూకాంబికాదేవి మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవిని శ్రీమహాలక్ష్మి అలంకారంలో, బజారుకలశం వద్ద అమ్మవారిని దుర్గాదేవిగా, రాజరాజేశ్వరీదేవిని శ్రీమహాలక్ష్మీ దేవిగా, కన్యకాపర మేశ్వరిని విజయలక్ష్మిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని రక్తబీజవధ అలంకారంలో, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను కాత్యాయినిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అర్థరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని గజలక్ష్మీదేవిగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరికి మోహిని అలంకారం, మూల విరాట్‌కు నెమలి ఈక, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్యయనీదేవిని సంతానలక్ష్మిగా, వెంకటేశ్వర స్వామికి వామన అవతారం, మందనాంచరేశ్వరిని మధుర మీనాక్షీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డక్కిలి: దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో పార్వతీదేవిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి దర్శనం కల్పించారు.

కోట: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని మహాలక్ష్మి అలంకారంలో, కోటమ్మ ఆలయ ప్రాంగణంలోని దుర్గాదేవిని మహాలక్ష్మిగా, గూడలిలోని రామలింగచాముండేశ్వరిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


గూడూరు: మహాలక్ష్మిగా విజయదుర్గాదేవి, రక్తభీజవధ అలంకారంలో ద్రౌపదీదేవి, దుర్గాదేవి అలంకారంలో బజారుకలిశం అమ్మవారు


వెంకటగిరి: మోహిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి, మధుర మీనాక్షిదేవిగా మందనాంచరేశ్వరి - కోట: మహాలక్ష్మి అలంకారంలో దుర్గాదేవి

టిప్పరు ఢీకొని ఐదు గొర్రెల మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం సమీపంలో శుక్రవారం టిప్పరు ఢీకొని ఐదు గొర్రెలు మృతి చెందాయి. యశోధమ్మకు చెందిన గొర్రెలు గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు వెళ్లాయి. రోడ్డు పక్కన మేస్తుండగా టిప్పరు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదు గొర్రెలు మృతిచెందగా పది గొర్రెలకు గాయాలయ్యాయి.

కోలాహలంగా వేనాటి సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు


వేనాటి సతీష్‌రెడ్డి, సురేష్ రెడ్డిలను సన్మానిస్తున్న అభిమానులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, అభిమానుల కోలాహలం నడుమ సూళ్లూరుపేటలో శుక్రవారం ఘనంగా జరిగాయి. దొరవారిసత్రం మండలం మావిళ్ల పాడులోని సతీష్‌రెడ్డి ఇంటి వద్దనుంచి కార్లు, మోటార్ల సైకిళ్ల ర్యాలీతో సూళ్లూరుపేటకు చేరుకున్నారు. హోలిక్రాస్ సెంటర్ వద్ద నుంచి అభిమానులు, నాయకులు కేరళ బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికి పూలవర్షం కురిపిస్తూ బాపూజీ వీధి మీదుగా ఆర్టీసీ బస్టాండు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ భారీ క్రేన్ సాయంతో వేనాటి సతీష్‌రెడ్డి, ఆయన సోదరుడు వేనాటి సురేష్ రెడ్డిలను గజమాలలు సన్మానించారు. భారీ కేక్ కట్ చేశారు. అనంతరం కోళ్లమిట్ట వద్ద కూడా సతీష్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాపా మునిరాజా, రమేష్ రెడ్డి, భాస్కర్, సురేష్ రెడ్డి, బుజ్జయ్య, చంద్రశేఖర్, బాలకృష్ణ, జయచంద్ర, మణికంఠ, గాడి నారాయణ రెడ్డి, మురళి రెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల మెరుగైన సేవలు అందించడమే ధ్యేయమని స్టేట్‌బ్యాంకు ఏజీఎం సత్యనారాయణ స్వామి అన్నారు. ఎస్‌బీఐ స్థాపించి 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సూళ్లూరుపేట ఎస్‌బీఐలో సమావేశం నిర్వహించారు. ఖాతాదారుల చేతుల మీదుగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ గిరిధర్ రెడ్డి, ఎఫ్‌వో నందకిషోర్, కృష్ణ, సాయిబాబ, కాళంగి ప్రభాకర్, వాకచర్ల రమేష్, ఓలేటి బాల సత్యనారాయణ, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న పీఏసీఎస్ పాలకవర్గ సమావేశం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన పాలకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఛైర్మన్ అల్లూరు కరుణాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

మూడు లారీల ఢీ

తడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మూడు లారీలు ఒకదాన్కొటి ఢీకొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఓ కంటైనర్ లారీ తడ బస్టాండ్ కూడలి వద్ద ఫ్లైఓవర్ సమీపంలో రోడు పక్కన ఆగింది. అదే దారిలో కుడివైపున మరో కంటైనర్ లారీ వెళ్తుండగా మరో కంటైనర్ లారీ రెండు లారీల మధ్యలో వెళ్లేందుకు ప్రయత్నించి ఇరుక్కుపోయింది. ఈప్రమాదంలో రెండు లారీలు కొంత మేర దెబ్బతిన్నాయి. రోడ్డుపై ట్రాఫిక్ అరగంటపాటు నిలబడిపోయింది.

మద్యం మత్తులో నదిలో దూకిన యువకుడు

వాకాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వాకాడుకు చెందిన ప్రసన్న అనే యువకుడు మద్యం మత్తులో స్వర్ణముఖి బ్యారేజీ గేట్ల రోపులను పట్టుకొని నదిలోకి దూకాడు. స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖ, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది ప్రసన్నను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించండి

తడ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. శుక్రవారం సాయంత్రం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. ముఖ్యంగా తడ మండలం వాటంబేడు, పెళ్లకూరు మండలం చిన్నప్పనాయుడుపేటలో లో వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, 33కేవీ సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

బహిరంగ ప్రకటన

SCHEDULE

Item No.1: SPSR Nellore Registration District at Present Tirupati Registration District, Naidupet Sub-Registration - Pellakur Mandal - Pennepalli Gram Panchayat, Pennepalli Village Accounts - Patta No.204 - Survey No.11-1B an extent of Ac.0.45 cents of wet land and in it an extent of Ac.0.23 cents bounded by: East : Land belongs to Kudiri Surendra, South : Land belongs to Kudiri Chakrapani, West: Land belongs to Kudiri Bhaskar, North : Land belongs to Kudiri Suresh.

Item No.2: SPSR Nellore Registration District at Present Tirupati Registration District, Naidupet Sub - Registration - Pellakur Mandal - Pennepalli Gram Panchayat, Pennepalli Village Accounts - Patta No.204 - Survey No.11 - 3 an extent of Ac.0.07 cents out of an extent of Ac.0.10 cents of wet land bounded by: East : Highway Road, South : Land belongs to Kudiri Surendra, West : Land belongs to Ravilla Sireesha, North : Land belongs to Ravilla Sireesha.

Item No.3:SPSR Nellore Registration District at Present Tirupati Registration District, Naidupet Sub Registration - Pellakur Mandal - Pennepalli Gram Panchayat, Pennepalli Village Accounts - Patta No.238, Survey No.11-1A an extent of Ac.0.20 cents out of Ac.0.23 cents of wet land bounded by: East : Land belongs to Doddapa Renuka, South: Land belongs to Kudiri Ramanaiah and Others, West : Land belongs to Kudiri Ramanaiah and Others, North : Land belongs to Kudiri Bhaskar. Item Nos.1 to 3 admeasuring total extent of Ac.0.50 cents of wet land and with all easementary rights.

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528










బంగారు భక్తుడు శ్రీకృష్ణదేవరాయలు



చిత్రం: కె.మహేశ్వర్

తిరుమల శ్రీవేంకటేశ్వరుని ధన, కనక, వస్తువాహనాదులతో సేవించిన భక్తుడు శ్రీకృష్ణదేవరాయలు. విజయనగర చక్రవర్తిగా ఉన్న 20 ఏళ్ల(క్రీ.శ.1509-1529)లో ఏడుసార్లు తిరుమల కొండకు వచ్చిన ఈయన సమర్పించిన కానుకలు కొల్లలు. తన ఇరువురు రాణులు తిరుమలదేవి, చిన్నాదేవిలతో కలిసి వచ్చి ఈయన తిరుమల శ్రీవారిని సేవించుకునేవారు. వజ్ర, స్వర్ణ, మణిమయ ఆభరణాలు ఎన్నో శ్రీకృష్ణదేవరాయలు స్వామికి సమర్పించారు. 1513లో నాలుగుసార్లు స్వామిని దర్శించుకున్న ఈయన నవరత్నాలు పొదిగిన బంగారు కిరీటాన్ని స్వామికి కానుకగా సమర్పించారు. ఉత్సవమూర్తులకూ మూడు బంగారు కిరీటాలు చేయించారు. 30వేల బంగారు నాణేలతో స్వామికి అభిషేకం చేశారు. 1515లో మకరతోరణం చేయించగా, 1517లో ఆనందనిలయానికి బంగారు పూత పూర్తి చేయించారు. 1521లో విలువైన వజ్రాలు సమర్పించారు. తాళ్లపాక గ్రామాన్ని స్వామి సేవలకోసం దానంగా ఇచ్చారు. నమస్కార భంగిమలో ఉండే శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం తిరుమల ఆలయంలో బంగారుమేడ ముంగిట్లో ఉంటుంది.



మూడు పుస్తకాల ఆవిష్కరణ

తిరుమలలో శుక్రవారం ఉదయం జరిగిన సింహవాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆవిష్కరించారు. ఇందులో వాసుదేవరావు రచించిన 'ది క్వింటెస్సెన్స్ ఆఫ్ రిగ్ వేద అన్ ఇంట్రడక్షన్', డాక్టర్ నర్సం నరసింహాచార్య రచించిన 'శ్రీహరి భక్త విజయం', డాక్టర్ ఎస్ఎస్ లీ రచించిన 'ఆనందనిలయం' పుస్తకాలున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 4 షెడ్లలలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.1.74 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,388
తలనీలాలు సమర్పించినవారు: 21,998



యోగనరసింహుడికి కళానీరాజనం

బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం సింహ వాహనసేవలో యోగనరసింహుడి అవతారంలో స్వామి భక్తులకు దర్శనమిస్తుండగా కళాబృందాల ప్రదర్శనలు హోరెత్తిపోయాయి. 9 రాష్ట్రాలకు చెందిన 20 బృందాలు ఉదయం ప్రదర్శనలిచ్చాయి. 557 మంది కళాకారులు రెండున్నర గంటల పాటు సంప్రదాయ కళాప్రదర్శనలు ఇచ్చారు. గుస్సడి(తెలంగాణ), తిప్పని(గుజరాత్), లవణి(మహారాష్ట్ర), భరతనాట్యం, నవదుర్గ, కూచిపూడి(ఏపీ), బిహు నృత్యం(అసోం), సంపల్పురి నృత్యం(ఒడిసి), గౌరాసుర్(ఝార్ఖండ్), శ్రీవేంకటేశ్వర మహత్యం(కర్ణాటక), ఢాక్ నృత్యం(పశ్చిమ బెంగాల్) వంటి ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



25 కేజీల బరువు కవచంతో...

సింహ వాహన సేవలో భక్తుల దృష్టిని నరసింహావతారం ప్రత్యేకంగా ఆకర్షించింది. విశాఖజిల్లా గాజువాక మండలం పాతకర్నవాణిపాలెంకు చెందిన కె.సూర్య 25 కిలోల బరువైన నరసింహుడి రూపుగల కవచాన్ని ధరించి పాల్గొన్నాడు. దాని ఎత్తు ఎనిమిది అడుగులు. మూడు గంటల పాటు బరువైన కవచంలో ఉక్కపోతతో చెమటలు కక్కుతూనే భక్తులకు కనువిందు చేశాడు. శ్రీవారు తనకు కల్పించిన గొప్ప అవకాశమని 'ఆంధ్రజ్యోతి'తో సూర్య సంతోషం వ్యక్తంచేశాడు. హిరణ్యకశ్యప అవతారంలో శివకుమార్ అద్భుత ప్రదర్శన ఇచ్చాడు.



వేతన వేదన

● సమగ్ర శిక్ష ఉద్యోగులకు అందని జీతాలు ● 800 మంది ఎదురుచూపులు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అందరూ చదవాలి....అందరూ ఎదగాలి అనే నినాదంతో ముందుకు సాగుతున్న సమగ్రశిక్ష విభాగంలో ఉద్యోగులు జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. విద్యాబోధనతోపాటు విద్యాశాఖ కార్యాలయాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాల అమలుకు పనిచేస్తున్న సిబ్బందికి అక్టోబర్ నాటికి రెండు నెలల జీతాలు పెండింగ్ ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 800 మంది ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల జీతాలు కేంద్ర బడ్జెట్ ఆమోదంపై ఆధారపడి ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు సమకూర్చకపోగా కేంద్రం ఇస్తున్న వాటినీ వాడేస్తున్నందునే తమకు వేతన కష్టాలని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జీతాలు రాకపోతే ఈ ఏడాది తమ ఇళ్లలో దసరా పండుగ లేనట్లేనని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు వినతులు అందచేశామని, వెంటనే జీతాలు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



చేపల దొంగ పోలీసులకు అప్పగింత

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో గత కొంతకాలంగా దొంగతనంగా చేపలు పట్టుకుని వెళ్తున్న నిందితుడ్ని యజమాని కాపుకాచి పట్టుకుని శుక్రవారం పోలీసులకు అప్పగించిన సంఘటన జరిగింది. వివరాల మేరకు... సంగంలోని బీరాపేరు ఒడ్డున కృష్ణా జిల్లాకు చెందిన ఏసు అనే వ్యక్తి చేపల చెరువులు లీజుకు తీసుకుని చేపల సాగుచేస్తున్నాడు. గత కొంతకాలంగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంగా చేపలు పట్టుకుని వెళ్తున్నట్లు యజమాని గుర్తించాడు. దీంతో ఎలాగైనా పట్టుకోవాలని కొంతదూరంలో ఉండి పగలు, రాత్రి కాపలా కాస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ యువకుడు చేపల చెరువులో వల వేసి చేపలు పడుతుండగా గమనించిన యజమాని పట్టుకునేందుకు చేపల చెరువు వద్దకు రాగా నిందితుడు తప్పించుకునేందుకు కాలువలో దూకి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో అక్కడున్న వారు చుట్టుముట్టి నిందితుడితోపాటు వల, చేపలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించగా నిందితుడు సిద్దీపురం గ్రామస్థుడిగా తెలిసింది. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు.



వల వేసి పట్టిన చేపలు, నిందితుడు వెంకటేశ్వర్లు



చెత్త తొలగింది!

జిల్లా పాలనా కేంద్రమైన కలెక్టరేట్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు పెరిగిపోయాయంటూ 'చెత్త శుద్ధి ఇదేనా?' శీర్షికతో ఈ నెల 23న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి యంత్రాంగం స్పందించింది. అధికారులు స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించి కలెక్టరేట్ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడులో రాగి తేజ అనే గిరిజనుడి పూరిల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. తేజ ఎస్టీ కాలనీలో పూరిల్లు వేసుకుని కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి టీవీ చూసేందుకు సమీపంలోని తండ్రి ఇంటికి భార్యా పిల్లలందరూ వెళ్లారు. ఉన్నటుండి ఇంట్లో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కలవారు చూసి తేజకు తెలిపారు. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చేటప్పటికి ఇంట్లోని సామగ్రి, కొంత నగదు, బంగారు వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మోటారు బైక్ బోల్తా : ఒకరికి గాయాలు

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉడ్‌హౌస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ముంబాయి జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మోటారు బైక్ బోల్తా పడింది. ఈ సంఘటనలో మోటారు బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల మేరకు... గుర్తుతెలియని వ్యక్తి మోటారుబైక్‌పై సంగం వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి మోటారుబైక్ బోల్తా పడడంతో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితున్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు అపస్మారక స్థితిలో ఉండడంతో వివరాలు తెలియరాలేదు. ఆమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మోటారు బైక్ బోల్తాపడి గాయపడిన వ్యక్తి

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి

● బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. వ్యవసాయాన్ని సులభతరం చేయడానికి రోటావేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, కట్టర్లు, లెవలింగ్ బ్లేడ్స్ తదితర వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో సాగులో లేని 70వేల ఎకరాల భూములను సాగులోకి తీసుకురావటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రీసర్వే బాధితులకు న్యాయం చేయండి

● వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలం మాదన్నగారిపల్లె పంచాయతీలోని రైతులకు వైసీపీ హయాం లో చేసిన రీసర్వే శాపంగా మారిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రాష్ట్ర శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. రామ న్నగారిపల్లి, మాదన్నగారిపల్లి గ్రామాల్లో 30 ఏళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన సుమారు 200 మందికి 400 ఎకరాలు డీ ఫారం పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రైతులు రుణాలు కూడా తీసుకుంటున్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే తరువాత ఆ భూములను రికార్డులలో ప్రభుత్వ భూములుగా నమోదు చేయడంతోపాటు వాటిని హోల్డ్‌లో ఉంచారు. బ్యాంకుల్లో రైతు లు తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే రైతుల పేర్ల మీద భూములు లేవు. దీంతో పేద రైతులకు అప్పటి నుంచి రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల పేర్ల మీద రికార్డులలో ఎక్కించేందుకు సీసీఎల్ఏకు జేసీ ప్రతిపాదనలు పంపారు. దీనికి సీసీఎల్ఏ నుంచి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో రైతుల కు అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందకుండా పోయాయి. రెవెన్యూ మంత్రి స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలి.





నిధుల పరిమితిని పెంచేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలి

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి/జలదంకి, (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మురుగు కాలువల నిర్మాణానికి నిధుల పరిమితి పెంచేలా సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో కోరారు. ఉపాధి నిధులతో నిర్మించి సిమెంట్‌రోడ్ల పక్కనే మురుగు కాలువల నిర్మాణానికి సాఫ్ట్‌వేర్‌లో పరిమితి రూ.లక్ష వరకు మాత్రమే ఉందన్నారు. వంద మీటర్ల మురుగు కాలువ నిర్మాణానికి రూ.4 లక్షల వరకు నిధులు అవసరమవుతాయన్నారు. నిధుల పరిమితిని రూ.5-50 లక్షలలోపు పెంచడంతోపాటు అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం కోసం నిధుల వ్యయాన్ని పెంచాలని కోరారు. ఈ అంశంపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయం నుంచి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందన్నారు.



బిట్రగుంటలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

కావలి, (ఆంధ్రజ్యోతి) : బిట్రగుంటలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యాలు ఏర్పడి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన క్రిష్ణపట్నం పోర్ట్, త్వరలో ప్రారంభం కానున్న రామాయపట్నం పోర్ట్, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, అలాగే త్వరలో ఏర్పడనున్న దామవరం ఎయిర్‌పోర్ట్, అర కి.మీ దూరంలో జాతీయరహదారులు బిట్రగుంటకు అందుబాటులో ఉన్నాయన్నారు. బిట్రగుంట లో 925 ఎకరాల రైల్వే భూమి ఖాళీగా ఉందని, అక్కడ మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తే కంటైనర్ డిపోలు, గోదాములు, ప్యాకింగ్ సెంటర్లు, బ్రేకింగ్ యార్డులు అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఈ పార్క్ ద్వారా రవాణా సౌకర్యాలు విస్తరించి రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు చైన్నై, బెంగళూరు, హైద్రాబాద్ వంటి మహానగరాలకు సరుకులు త్వరగా చేరుతాయన్నారు.

